


ఈ మధ్య శీతారామయ్య ప్రవర్తన నాకు చాలా వింతగా కనిపిస్తోంది. ఆలోచించిన కొద్దీ వీడు వున్నట్టుండి ఏమైపోతాడో అన్న దిగులు కూడా ఆవరిస్తోంది నా మనస్సుని. గోచీ పెట్టుకోవటమంటే ఏమిటో కూడా తెలీకనే ఊరిబైట కాలవలో ఈతలు కొట్టే నాటినుండీ, నేటివరకూ శీతారాముడూ నేనూ స్నేహితులుగానే ఉంటున్నాం. నా నమ్మకాలు వాడికీ, వాడివి నాకూ తెలిసినట్టు మరొకడికి తెలీవంటే ఎవరూ ఆశ్చర్య పడక్కర్లేదు. ఒక కంచంలో తిని, ఓ మంచంలో పడుకోకపోయినా, నా కంచంలో వాడికిష్టమైన కూర కనిపించినప్పుడూ నా మంచంలో నల్లి పాకుతున్నప్పుడూ వాడు నాకు గుర్తొస్తూనే వుండేవాడు. ఇప్పుడూ వస్తూనే వున్నాడు. వాళ్ళమ్మ వాడికిష్టమైన బంగాళాదుంప, ఉల్లిపాయల వేపుడు చేసినప్పుడు వాడి మొహం ఎలా వెలిగిపోతుందో నాకే తెలుసు! బహూశ ఓ అయిదారేళ్ళనుంచీ - వాడి తల్లిలాగే వండగలిగితే - వాడి పెళ్ళానిక్కూడా తెలిసి వుండొచ్చు. అలాగే నా మంచంలో నల్లి పాకుతుంటే శీతారామయ్య నాకు తప్పకుండా జ్ఞాపకం వస్తాడు. నల్లిని చూసిన వాడి మొహం ఎంత భీకరంగా తయారవుతుందో తల్చుకుంటే చచ్చేటంత నవ్వొస్తుంది నాకు. నల్లిని గురించి వాడు నాకు బోధించే విషయం అంతటి ప్రత్యేకత కలవటం అందుకు కారణం!

"ఒరే మోహనా! భగవంతుడి సృష్టిలో నల్లిని మించిన భయంకరమైన జీవి మరొకటి లేదంటే నమ్ముతావా?" అన్నాడొకసారి.

"ఎలారా?" అన్నాను.

"నువ్వొట్టి దద్దమ్మవి. లోకంలో ప్రతివాడూ నల్లి మానవ రక్తం పీలుస్తూ వుంటుందని మాత్రమే గమనించాడు. అంతకంటే మరో రకంగా ఆలోచించలేదు. నేనాలోచించాను. అలాని లోకంలోని వాళ్ళందరికంటే నేను మేధావినని అనుకోను. వాళ్ళంతా ఆలోచించే ఓపిక లేక ఆ పని చెయ్యలేకపోయారనీ, సరదాగా నేను ఆలోచిస్తున్నాననీ అనుకోరా!" అన్నాడు శీతారామయ్య.

"నువ్వు మేధావివని అనుకునేటంత వెర్రి వెధవని కానురా నువ్వు! అసలు సంగతేమిటో చెప్పి తగులడు!" అన్నాను.

"నల్లిని చూసి మానవుడు చాలా నేర్చుకున్నాడు. ఇంకా హత్తుకునేలా చెప్పాలంటే, సదరు నల్లి మనిషికి ఎంతో నేర్పుతోంది - అనవచ్చు. దయా దాక్షిణ్యాలు లేకుండా, ఏ పాపమూ ఎరగని అల్ప జీవుల్లో మిగిలివున్న నాలుగు నెత్తురు చుక్కల్నీ పీల్చివేసే స్వార్థపరులకు పెద్ద గురువు నల్లి! ఒప్పుకుంటావా?" అన్నాడు శీతారామయ్య, గర్వంగా.

శీతారామయ్య కొన్ని సంగతులు చెప్పేటప్పుడు చాలా చిత్రంగా చెపుతాడు. అది వాడి 'సింబాలిజం' ఆ సింబలిజాన్ని ఓ పట్టాన నేను మర్చిపోలేను. అందుకనే నల్లిని చూసినపుడు వాడు గుర్తుకొస్తుంటాడు నాకు.

శీతారామయ్య తండ్రి కష్టజీవే అయినా చాలా పేరున్న వ్యక్తి. 'పేరు' అనేది రోజుల్లో ఎన్నో మార్గాల్లో వస్తూంటుంది. మనుష్యుల్ని చేరేందుకు విచిత్ర పరిస్థితుల్లో వరిస్తుంది. తుపానులూ, వరదలూ, భూకంపాలు మొదలైనవి నష్టాలు కలిగించినప్పుడు, కొంతమంది అనాథలయుల్ని వెంటేసుకుని చందాలకు వీధినపడి 'చందిస్తే'...దాతలకి అందవలసిన దాంట్లో మూడొంతులు మింగేసినా మిగతాది ఓ సభజరిపి, ఆ వేదికమీద ఒక నాయకుడిచేత పంపకం చేయిస్తే చాలు. కావలసినంత పేరు. (పేరుకోసం చేయవలసిన పన్లేమిటో వరసగా చెప్పుకుపోతే గుణాఢ్యుడి బృహత్కథని మించిపోతుంది కాబట్టి అవన్నీ చెప్పలేనని మనవి)

చెప్పొచ్చే దేమిటంటే శీతారామయ్య తండ్రి రంగయ్యగారు ఆ ఊళ్లో నలభై ఏళ్ళపాటు ప్రైవేట్లు చెప్పేవారు. ఆయన దగ్గర చదువుకున్న వాళ్ళినాడు దేశంలోని వివిధప్రాంతాల్లో ఇంజనీర్లుగా, డాక్టర్లుగా ఇంకా ఎన్నో హోదాల్లో ఉన్నారు. వాళ్ళ పెద్దలెవరేనా రంగయ్యగారు కనిపిస్తే రెండుచేతులూ జోడించి, "మీచేతుల్లో అక్షరాభ్యాసం చేయించాడు. మావాడీరోజు ఇంత పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. మీ చెయ్యి బంగారం మాష్టారూ!" అంటారు. రంగయ్యగారికి ఈ రకమైన మాటలే మిగిలిన సంపదంతాను! ఆయనవేమ ఆ [illegible] చాలా ఊళ్ళలో సందర్భం వచ్చినప్పుడల్లా చెప్పుకుంటూ వుంటారు. అ రకంగా ఆయన 'పేరు' పొందిన వాడన్మాట గాని మరేమీ చేసి కాలేదు. అంత పేరున్న రంగయ్యగారి ఏకైక పుత్రుడు శీతారామయ్య. నిజమైన పేరున్న రంగయ్యగారి లాంటి వ్యక్తులు పేరునుతల్చుకుని తృప్తి పడాల్సిందేగాని బ్యాంకుల్లో ఎకౌంట్లు ఓపెన్ చేసుకోవటం జరగదన్న సంగతి బహిరంగరహస్యం! అందుకే కొడుకును కాలేజీలో చేర్పించటానికి సాహసం చేసేడుగాని, అది పూర్తి అయ్యేలా చెయ్యడానికి అష్టకష్టాలూ పడవలసి వచ్చింది. మొత్తంమీద శీతారామయ్య బాధ్యత గుర్తించి డిగ్రీ పుచ్చుకుని ఆ మరుక్షణంనుంచి 'వాంటెడ్ కాలమ్స్' మీదికి

ఎగబడ్డాను. ఆ పనిలో నాకు వాడూ వాడికి నేనూ చేదోడు వాదోడు. నా అదృష్టం బాగుండి వాడికంటె మూడేళ్ళ ముందు ఓ ప్రైవేటు కంపెనీలో గుమాస్తాగా చేరేను. వాడుకూడా నేను పనిచేసే కంపెనీలోనే గుమాస్తా కావటానికి నేను మూడేళ్ళ సర్వీసు పూర్తి చెయ్యాల్సొచ్చింది. ఆ మూడేళ్ళ కాలంలో శీతారామయ్య - నిరుద్యోగిగా రకరకాల అనుభవాలు పొందేడు. వాటిలో ఒకటి రెండు సంఘటనలు మీకు చెప్పవలసిన అవసరం ఉన్నది.

అప్పట్లో విజయవాడ అనే మహాపట్నంలో ఒక మారుమూల ఇరుకుసందులో రంగు వెలిసిన బోర్డు మీద ఓ "కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు" వేలాడుతూండేది. ఆ బోర్డును భరించిన కొంపాంపు గోడలున్న ఒక పాతకాలంనాటి భవంతి. ఆ భవంతిలో మధ్యహాల్లో గుమాస్తాలు పదిమంది పని చేస్తూ వుండేవారు. ఆ హాలుకి దక్షిణపువేపు ఓ విశాలమైన గది. ఆ గదిలో ఒక ప్రక్కన...పైన వేళ్ళాడే బూజుపట్టిన ఫానుకింద ఒకపెద్ద గాడ్రెజ్ టేబిల్. దానిమీద లావుపాటి ఎకౌంటు పుస్తకాలో ప్రక్కనా, ఫోనో ప్రక్కనా. మధ్యలో రంగులు పొదిగిన గాజుపేపరు వెయిట్ క్రింద, ఫాను గాలికి రెపరెపలాడే కాగితాలూ, ఆ టేబిల్ కెదురుగా రివాల్వింగ్ కుర్చీలో ఒక నలభై ఏళ్ళ నడివయస్కు డొకాయన కూర్చునేవాడు. ఆయన ఆ అర్బన్ బాంకి 'సెక్రటరీ' అని ఆ గది గుమ్మానికి బైట తగిలించి వుండేబోర్డు తెలియజేస్తుంది. ఆయన పేరు పరంధామయ్య. చిన్నకళ్లు, కుంచించుకుపోయిన నుదురు. ఫ్రెంచికట్ మీసాలు, మధ్య పాపిడితీసి వెనక్కి దువ్వినజుట్టు. పొట్టిగా లావుగా వుండే శరీరం! పొట్టివాడు గట్టివాడన్నట్లు, ఆయన మొహం చిట్లిస్తే ఆ బ్యాంకి గుమాస్తాల గుండెలు దడదడలాడతాయి. ఆ మహాపట్నంలో ఆయన బాగా పలుకుబడి వున్నవాడు కూడాను.

రంగయ్యగారికి ఈ బాంకి సెక్రటరీ పరంధామయ్య పాత శిష్యుడు. ఓ సారి పరంధామయ్య తన స్వగ్రామంవెళ్ళి, ఎంతో అభిమానంతో గురువుగారిని కలుసుకున్నాడు. ఆ సందర్భంలో రంగయ్యగారు శీతారామయ్యకేదైనా చిన్నఉద్యోగం యిప్పించమని శిష్యుణ్ణి అడగటం, వెంటనే అతను ఒప్పుకోవటం జరిగింది.

"నా దగ్గిరికి పంపండి చూస్తాను! ఓ రెండు మూడు నెలల్లో తప్పకుండా ఎక్కడో అక్కడ వేయిస్తాను! బాబునుగురించి మీరేం బాధపడకండి! ఉద్యోగంలో జాయినయ్యే వరకూ మా పేటలో రెండు మూడు ఇళ్ళల్లో ట్యూషన్లు కుదురుస్తాను. రోజులు గడిచిపోతుంటాయి!" అని పరంధామయ్య హామీ యిచ్చేడు. రంగయ్యగారికి.

ఆ మరుసటి వారంలో శీతారామయ్య విజయవాడచేరి పరంధామయ్యగారింట్లో బస చేశాడు. ప్రొద్దుట ఓ రెండిళ్ళల్లో, సాయంత్రం ఓ రెండిళ్ళల్లో ప్రైవేట్లు చెప్పి ఓ వంద రూపాయలు సంపాయించుకునేవాడు. ఖాళీసమయంలో లైబ్రరీకిపోయి చదువుకోవటం, హోటల్లో భోంచేసి రాత్రికి పరంధామయ్యగారి మేడ మీది గదిలో పడుకోవటం. ఇదీ అతని దినచర్య అప్పట్లో! ఓరోజు పరంధామయ్యగారు ఏదో పనిమీద ఖమ్మం పంపించేరు. అంతకుముందే పరంధామయ్యగారు శీతారామయ్యను టైపులో చేర్పించేడు కూడాను. ఖమ్మం వెళ్ళిన నాలు రోజులూ శీతారామయ్య టైపుకి వెళ్ళలేకపోయేడు. తిరిగి వచ్చేక మళ్ళ టైపుకి వెళ్ళేడు. ఆ టైపు ఇన్‌స్టిట్యూట్ 'ప్రిన్స్‌పాల్' పరంధామయ్యకి మిత్రుడు కావటం వల్ల ఓ రోజు "మీరు పంపిన కుర్రాడు ఈ మధ్య నాలుగు రోజులు టైపుకి రాలేదు" అని చెప్పాడట! అది వినగానే పరంధామయ్య-శీతారామయ్య బాధ్యత ఎరగని వాడని, తన మాటను పాటించడంలేదని నిర్ణయించుకున్నాడు. ఆ మరుసటిరోజు



ఒంటికంటి వాడొకడు రెండుకండ్లు గలవాన్నిచూసి "నీకన్న నేనేఎక్కువ చూడగలను" అన్నాడు

"అదేమిటి నీకు మతి కాని పోతుందా"

"కాదు, నీకు నా మొఖంలో ఒక కన్నే కన్పిస్తుంది కాని నీ మొఖంలో రెండు కండ్లు చూస్తున్నాను." అన్నాడు పాపం ఏకాక్షి ఛాలెంజి చేస్తూ....

ఉదయం శీతారామయ్యని పిలిచి, "టైపుకి వెళ్ళలేదట నాలుగు రోజులు?" అన్నాడు సీరియస్‌గా.

"ఖమ్మం వెళ్ళిన నాలుగురోజులు మాత్రం వెళ్ళలేదండీ!" అన్నాడు. శీతారామయ్య!

అది యదార్థమని ఆయనకి అనిపించినా, తొందరపడి అడిగినందుకు బాధపడక పోగా, శీతారామయ్యని బాధ్యత లేదని నిందించేడు. పైగా "అక్కడ మీనాన్నగారెంత బాధపడుతున్నారో అన్న ఆలోచన లేదేమయ్యా నీకు? ఇంత రెక్‌లెస్‌గా ఉంటావా. యూస్‌లెస్ ఫెలో!" అనడానికి కూడా సాహసించేడు.

శీతరామయ్య రక్తం ఉడుకెత్తింది. అతను, అంత తీవ్రమైన మందలింపుకు తగిన తప్పేం చేశాడో ఊహించలేకపోయేడు. ఎంత ఆలోచించినా ఆయనలాఅనడానికి ఒక్కకారణంమాత్రమే కనిపించింది. తను ఉద్యోగం గురించి పరంధామయ్యని ఆశ్రయించేడు. అందుకనే ఆయన తననంత చిన్నచూపు చూస్తున్నాడు. ఆశ్రయించినంతమా తాన నీచంగా చూస్తాడా? అవమానిస్తాడా? బియ్యే చదివిన తనకు బాధ్యత గురించి నీతిబోధ చేస్తాడా? శీతారామయ్య సహించలేకపోయేడు.

"మీరు చాలా తొందరపడ్డారు! నిజం చెప్పినా మీరు నమ్మలేదంటే మీకు నామీద సదభిప్రాయం లేదని అనుకోవలసి వస్తోంది. మీకంత సదభిప్రాయం లేనప్పుడు నేను మిమ్మల్ని ఆశ్రయించుకుని ఉండటం కూడా నాకు మంచిది కాదనే అనుకుంటున్నాను!" అన్నాడు.

పరంధామయ్య తెల్లబోయి చూసేడు.

"మీరేదో ఉద్యోగం యిప్పిస్తానన్నారు గదా అని మీరు అయినదానికి కానిదానికి ఏంతిట్టినా పడూరుకునేటంత హీనుణ్ణి కాదు. అంత దుర్గతి పట్టలేదండి! నాకు శలవివ్వండి!" అంటూ శీతారామయ్య ఆయన ఏమంటున్నాడోకూడా వినిపించుకోకుండా క్షణాలమీద తన సామాను సర్దుకుని ఇంటికి తిరిగి వచ్చేసేడు.

జరిగిందంతా విన్న రంగయ్య గారికి, కొడుకు ప్రవర్తనలో తొందరపాటు ఏమీ కనిపించలేదు.

ఆ తరువాత ఒకసారి ఎవరో పెద్దాయన రికమెండ్ చేస్తానన్నాడన్న ఆశతో - తిరపతి వస్తానని మొక్కుకుని తల బాగా పెంచిన-శీతారామయ్య జిల్లా పరిషత్తులో లోయర్ డివిజన్ గుమాస్తా పోస్టుకి ఇంటర్వ్యూకి వెళ్ళేడు. మెడవరకూ వేళ్ళాడుతున్న అతని శిరోజాలు చూసి సెలక్షన్ కమిటీలో కూచున్న ఓ పెద్దమనిషి. "ఉద్యోగం ఒచ్చేత్తే తిరపతొస్తానని మొక్కుకున్నావేంటయ్యా!" అనడిగేడు నవ్వు.

శీతారామయ్య మండిపడ్డాడు.

"ఇంటర్వ్యూ అంటే నా ప్రపంచ జ్ఞానాన్ని, తెలివితేటల్ని పరీక్షిస్తారని వచ్చేను! నా చొక్కా ఎందుకు నల్లగా వుందో, నేను జుట్టు ఎందుకు పెంచేనో, నేను మీసాలు సన్నగా ఎందుకు చేయించుకున్నానో అడుగుతారని తెలిస్తే రాకపోదును! గుమాస్తా ఉద్యోగానికి పనికొచ్చేది నా చదువు, తెలివి! అంతేగాని నా జుట్టూ, నా మీసాలూ, నా చొక్కాలూ కాదుసార్! నా తరువాత వచ్చేవాళ్ళనైనా ఇలాంటి ప్రశ్నలు అడక్కండి ప్లీజ్!" అని వెనక్కి తిరిగి చూడకుండా బైటికి వెళ్ళిపోయేడు.

విషయమంతా విని రికమెండ్ చేస్తానన్న పెద్దమనిషి తెల్లబోయి పెదవి విరవడం, రంగయ్యగారు - ఇంత ముక్కుసూటి సన్నాసి ఎలా బతకగలడో-అని కొడుకును గురించి విచారించడం ఒకేసారి జరిగేయి. ఈ వివరాలన్నీ శీతారామయ్య ద్వారా, రంగయ్యగారి ద్వారా విని నేను ముక్కున వేలేసుకోవడం జరిగింది. అంతకన్న నేను చెయ్యగలిగిందీ ఏం లేదు.

తరువాత వాడి రోజులు బాగుండబట్టి మా కంపెనీలో గుమాస్తా ఉద్యోగంవచ్చింది. మూడేళ్ళ వియోగానంతరం ఇద్దరం కలుసుకున్నాం: ఒకే

రూమ్‌లో బసచేశాం! పెళ్ళిళ్ళయ్యాక వేరేవేరే ఇళ్ళకి మారినా మేం కలుసుకోని రోజులు చాలా అరుదుగా కనిపిస్తాయి.

అలా గడిచిపోయేయి కొన్నేళ్ళు. సర్వీసులో పెరుగుదల ఉన్నా హోదా నిశ్చలంగా గుమాస్తా పరిధిలోనే వుండిపోయింది, ఇద్దరికీ.

"ఒరే మోహనా! మనకంటే వెనకాతలచేరినా అక్కుపక్షులు కొందరు ప్రమోషన్లుకూడా కొట్టేసి హాయిగా ఉంటుంటే మన ఖర్మ యిలా కాలిందేమిట్రా?" అనడిగాడు శీతారామయ్య ఓరోజు.

"మనకి బతకడం చేతకాదురా రావుడూ!" అన్నా.

"తిండికి లోటులేకుండా బతుకుతున్నాముగా!" అన్నాడు శీతారామయ్య ఆశ్చర్యంగా!

"ఓరి పిచ్చిమాలోకమా! సభ్య సమాజం దీన్ని బ్రతుకు అని పిలువదోయ్! బతకటం అంటే బాగా డబ్బు సంపాదించటం! బ్యాంకుల్లో ఎకౌంట్లు ఓపెన్ చేయటం! లోలోపల ఎన్ని కొంపలుకూల్చినా, ఎంతమందినోళ్ళల్లో మట్టికొట్టినా, ఎన్ని దుర్భా పనులుచేసినా పైకి పెద్దమనిషిగా కనిపిస్తూ, చందాలూ అవీ యిస్తూ ధర్మదాతగా చలామణి కావటం! ఇదీ లోకందృష్టిలో నిజమైన బ్రతుక్కి పరమార్థం!" అన్నాను.

"ఇలాంటి 'ఘనకార్యాలు' మనబోటి గుమస్తా గాళ్ళకి సాధ్యమేనట్రా మోహనా?" అనడిగేడు శీతారామయ్య!

నేను పకాపకా నవ్వేసేను. శీతారామయ్య తెల్లబోయి చూసేడు.

"ఒరే రావుడూ! ప్రజలకి పనికొచ్చే ముఖ్యమైన వస్తువులు ఎన్నో మన కంపెనీలో తయారవుతున్నాయి. ఏజన్సీ లిప్పించమని వ్యాపారస్తులు ఎంతమంది అప్లికేషన్సు పెడుతున్నారో, ఎంతమంది రోజూ కాళ్ళరిగేలా తిరిగి పోతున్నారో చూస్తున్నావా?" అన్నాను.

"అయితే ...?" అన్నాడు శీతారామయ్య అయోమయంగా.

"నువ్వూ, నేనూ పనికిమాలిన సీట్లల్లో కూచుని వున్నాంగాని ఆ మంగరాజు చూడు! అసలైన సీట్లో కూచున్నాడు. అప్లికేషన్లు రికమెండ్ చేసి ఆఫీసరుకి పంపేవని వాడిది! అర్థంగాలేదూ! వాడిప్పుడు ఎడవుల ఫ్యాక్టరీ పక్కనే చిన్నదాదా కట్టిస్తున్నాడు" అన్నాను.

శీతారామయ్యముఖం కందగడ్డలా మారింది.

"ఒరే మోహనా! ప్రాణంపోతేమట్టుక నీతీ, నిజాయితీ పోగొట్టుకుంటావుట్రా? అవి రెండూ పోయాక బ్రతికినా చచ్చినా ఒకటేరా," అన్నాడు ఆవేశంతో!

నాకు తెలుసు! శీతారామయ్య నోట ఆ మాట వింటాననే ధైర్యం నా కుంది! ఒకే వూళ్ళో ఒకే పరిసరాల్లో, ఒకే రకమయిన అభిప్రాయాల్లో పెరిగిన వాళ్ళం!

"రావుడూ! మనం కొన్ని ధర్మాలకి కట్టుబడి జీవించదలచుకున్నాం. కనుకనేమనకి ఎదుగులేదు! లేదని ఒకటికి పదిసార్లు బాధపడ్డం ప్రారంభిస్తే, మనస్సు చలిస్తుందిరా!" అన్నాను.

"అవున్రా! అది నిజమే!" అన్నాడు శీతారామయ్య. వాడి కళ్ళు ఎటో చూస్తున్నాయి.

ఇప్పుడు అసలు విషయాని కొస్తాను. వాడికి జాతకాలు చూపించుకోవడంమీదా, మొక్కుబడుల మీదా, పూజలూ పునస్కారాల మీదా నమ్మకం, (ఒకప్పు డుండేది గాని) ఇప్పుడు లేదు. కేవలం మానవశక్తిమీద వాడికెంతో విశ్వాసం!

అలాంటి నిప్పులాంటి శీతారామయ్య ఈ మధ్య చాలా వింతగా ప్రవర్తిస్తున్నాడు.

ఆ రోజు నేనో పది నిముషాలు ఆలస్యంగా ఆఫీసులో అడుగు పెట్టేను. మానేజరుతో గాని, హెడ్‌క్లర్కుతోగాని నాకెలాంటి విరోధాలూ లేనందువల్ల మామూలుగానే సంతకంపెట్టి నా సీట్లోకూర్చున్నాను. ఎదురుగా శీతారామయ్య సీటు ఖాళీగా కనిపించేసరికి నా కళ్ళని నేనే నమ్మలేక పోయేను.




పక్కనే సీట్లో ఫైలు చూస్తున్న మరో గుమస్తా మిత్రుణ్ణి చూసి, "ఏమండీ! శాస్త్రిగారూ! మా శీతారామయ్య ఏడీ?" అనడిగేను.

"ఆ శీతారామయ్య సంగతి మీకే తెలియాలి. మాకు తెలుస్తుందా చెప్పండి!" అన్నాడు శాస్త్రి జోక్‌గా!

"నిజమే అనుకోండి!" అంటూ డ్రాయర్ తెరిచేను.

శాస్త్రి క్షణం ఆగి, "ఈ వేళ శెలవు పెట్టేడట!" అన్నాడు.

"శెలవు పెట్టేడా?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఏం? ఆయన శెలవు పెట్టకూడదంటారా?" అనడిగేడు శాస్త్రి, ఎగతాళిగా చూస్తూ.

"నేనలా అంటున్నానా? శెలవు పెట్టాల్సినంత అవసరం వాడికేం ఉన్నట్టు లేదే! నిన్న సాయంత్రం చాలా సేపు మాట్లాడుకున్నాం! ఈ వేళ శెలవు పెడుతున్నట్టు నాతో మాటమాత్రం అనలేదు మరి! అంటూ ఫైలులోని కాగితాలు తిరగెయ్య సాగేను.

ఆఫీసు గడియారం లాగే పనికూడా యాంత్రికంగానే చేసుకుపోతున్నాను. కాని నా మస్తిష్కంలో సవాలక్ష ఆలోచనలు! శెలవు పెట్టడం విషయంలో వాడికి కొన్ని సిద్ధాంతాలున్నాయి. నాలాగా తలనొప్పి వచ్చినా, ఒంట్లో నిస్త్రాణగా వున్నా, ఇంట్లో చిన్నా చిన్నా దుమారం రేగినా వాడు శెలవు పెట్టడు.

"ఇప్పుడేమండీ పుణ్యమా అని కాఫీ దేవుడు ప్రతిచోటా ఉంటున్నాడు. డాక్టర్లతో పనిలేకుండా తలనొప్పి మాత్రలు ప్రతి కిళ్ళీకొట్లోనూ సమృద్ధిగా దొరుకుతున్నాయి. వెధవ తలనొప్పి గురించి అతి విలువైన శెలవు నష్టపరుచుకోవటం వ్యర్థంరా మోహనా! పోతే, ఇంట్లో దుమారం రేగినప్పుడు శెలవుపెట్టి ఇంట్లోనే వుండిపోతే అది చల్లారక పోగా మరింత రాజుకుంటుంది. కనుక అప్పుడు శెలవు అనవసరం! మనబోటి వాళ్ళకి జైలుగానీ, స్వర్గంగానీ, నరకంగానీ, ఆఫీసే!" అంటాడు శీతారామయ్య! పైగా నాతో ముందుగా చెప్పకుండా వాడెప్పుడూ శెలవు పెట్టలేదు. అంచేత నేను మరీ ఇదయ్యేను.

సాయంత్రం ఆఫీసులోంచి బైటపడి, నాయర్ హోటల్లో టీ తాగి సిగరెట్టు ముట్టించేను. కొన్ని క్షణాలు హోటల్ బైట నిలబడి శీతారామయ్య ఇంటికి వెళ్ళొద్దామా మానెయ్యమా అని ఆలోచించేను. వెళ్ళి విషయమేమిటో వాడి హోమ్ డిపార్టుమెంటుని అడిగితే మంచిదని (వాడు ఇంటిదగ్గర లేకపోతే) నిర్ణయించుకుని మెల్లిగా నడక సాగించేను.

వాడిల్లు చేరేసరికి నిజంగానే వాడింటిదగ్గర లేడు.

"ఎక్కడికెళ్ళేడమ్మా వీడు?" అన్నాను వాకిట్లో నిలబడి.

"సింహాచలం వెళ్ళేరన్నయ్యా! ఈ పాటికి వస్తూనేవుంటారిపుడు. అదేమిటి అక్కడే నిలబడ్డారు! లోపలికి రండి!" అన్నది శీతారాముడి పెళ్ళాం కమల!

ఇష్టంలేకపోయినా లోపలికినడిచేను.వరండాలో చెప్పులొదిలి హాల్లో ఉన్న పడక్కుర్చీలో కూలి, "అప్పుడు! ఏమిటొక్కసారిగా వీడికి దేవుడిమీద ఇంత భక్తి పుట్టుకొచ్చింది?" అనడిగేను.

"అలాంటిదేం లేదండీ! ఆ ఊరికో పెద్ద స్వాములవారొచ్చేరట! ఆయన గొప్ప జ్యోతిష్కులట కూడాను! ఒకసారి చూసివస్తానని వెళ్ళేరు! ఉండండన్నయ్యా కాఫీ తెస్తాను!" అని కమల లోపలికి వెళ్ళబోయింది.

"ఆ చేత్తోనే నాక్కూడా పత్రావే!" అంటూ సుడిగాలిలా లోపలికి జొరబడ్డాడు సీతారామయ్య! తెల్లబోయి వాడివేపు చూశాను. వెయ్యి కాండిల్ బల్బులా వెలిగిపోతోంది వాడి మొహం. నేనువాడి వెర్రాన్ని చూశాను. కమల ఓసారి మొగుడివంక ఆపేక్షగా చూసి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"స్వాములవారు నీ చెయ్యికూడా చూసేరా?" అని అడిగేను వ్యంగ్యంగా! వీడిలో ఇంత ఆకస్మికంగా ఈ పిచ్చి ఎలా జనించిందో నాకు అర్థం కావడంలేదు.

సీతారామయ్య కుర్చీలో జార్లబడి కళ్లు మూసుకొని కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. అంతలో కమల రెండు గ్లాసులతో కాఫీ తెచ్చింది.

"రాత! ఏమిటీ వెర్రివేషాలూ మీరూను! అవతల అన్నయ్య కూచుంటేను!" అన్నదామె.

"అబ్బ! నువ్వుండవే గోల! స్వాముల వారి వాక్యాలు జ్ఞాపకం తెచ్చుకోనీ!" అంటూ సీతారామయ్య భార్య చేతిలో గ్లాసులందుకుని నాకోటి అందించేడు. కమల లోపలి గుమ్మం వారగా నిల్చుంది.

"ఒరేయ్ మోహనా! స్వాములవారు సామాన్యుడు కాదు. త్రికాలవేది! అందులో ఏమీ సందేహంలేదు" అన్నాడు సీతారామయ్య.

నాకు చిర్రెత్తుకొచ్చింది.

"కాళ్ళు కడిగి ఆ నీళ్లు నెత్తిన జల్లుకున్నావా. లేదా?" అనడిగేను.

"చల్లుకుంటే పాపం రాదు" అన్నాడు వాడు.

"అవునవును! పాపం ఎందుకొస్తుంది! చేసిన పాపాలు పోతాయి కదా! ఎన్ని తప్పుడు పనులు చేసినా, ఒక్కసారి ఏ స్వాములారి కాళ్లో కడిగి ఆ నీళ్లు నెత్తిన చల్లుకుంటే చాలు! పాపాలన్నీ పటాపంచలై స్వర్గద్వారాలు తెరుచుకుంటాయి ఆ పుణ్యాత్ముల కోసం! మన పెద్ద బుర్రలు చెప్పిందదే కదరా తండ్రీ! మొత్తంమీద వాళ్ళ పేరు నిలబెడుతున్నావు నువ్వు! గో ఎహెడ్! మేగాడ్ బ్లెస్ యు!" అన్నాను ఆవేశంగా!

సీతారామయ్య క్షణకాలం మౌనంగా వూరుకుని "నీకు కోపంవస్తే రానీగాని. చెప్పేది విను! నాకిప్పుడు చాలా మంచిరోజులట. కొద్ది రోజుల్లోనే నాకు ఉద్యోగంలో పై మెట్టుకి పోయే యోగం వుందనీ స్వాములారు బల్లగుద్ది మరీ చెప్పేరు!" అన్నాడు తన్మయత్వంతో.

"నే నప్పుడే అనుకున్నాను. ఇలాంటి మాటలేవో చెప్పబట్టే ఆ స్వాములారు నీ కళ్ళకి త్రికాలవేదిలా కనిపిస్తున్నాడని ఇంకేం! ఇహ నీ బతుకు మూడు పువ్వులూ. ఆరు కాయలుగా వెలిగిపోతుందన్నమాట రావుడూ! కాస్త నాకోటి నష్టజాతకుల్ని కనిపెట్టుండు!" కాఫీ గట-గట తాగేసి గ్లాసు కిందపెట్టి లేచేను.

"అప్పుడే వెళ్తావేమిరా?" అన్నాడు సీతారామయ్య.

"ఆఫీసునుంచి సరాసరి ఇటే వచ్చేశాను.చాలా ఆలస్యమైంది." అంటూ వాడి జవాబుకి ఎదురు చూడకుండా రోడ్డుమీద పడ్డాను.

సీతారామయ్యలో మార్పుస్పష్టంగా కనిపిస్తోంది. ఆ మార్పు నా కిష్టంలేదు. మనిషి తనమీద తన కుండవలసిన విశ్వాసాన్ని కోల్పోయినప్పుడే జాతకాలను నమ్ముకోవటం ప్రారంభిస్తాడు. అలాంటి స్థితికి సీతారామయ్య వచ్చేసేడని గ్రహించిన వెంటనే నా గుండెను ఎవరో శూలంతో పొడుస్తున్నంత బాధ కలిగింది. నా బాల్య స్నేహితుడీ రకంగా తయారు కావటం నాకు దుస్సహంగా తయారైంది. అయినా నేను అశక్తుణ్ణి.

ఆ తరువాత కొన్నాళ్ళు మామూలుగానే జరిగేయి. కాని కొత్తసంగతేమిటంటే సీతారామయ్య మంగరాజు వెంట పిల్లికూనలా తిరుగుతున్న వైనం

# పాతఅచ్చులో కొత్తకథ

## సత్య నక్షత్రకుడు

ఆకాశాన్ని అంటుకుంటున్న మేడలున్న అమెరికాదేశంలో (అతిశయోక్తి కాదు; నిజంవర్ణన) ఒకాయన ఒకదేశాన్ని అమ్మేస్తానంటూ గొంతెత్తి అరుస్తున్నాడు. ఆ దృశ్యం అచ్చం సత్యహరిశ్చంద్ర నాటకంలో చంద్రమతిని అమ్ముతున్న దానికి నకలుగా వుంది. అయితే అక్కడ హరిశ్చంద్రుడి జాడలేదు. అమ్ముతున్నాయన మాత్రం నక్షత్రకుడిలాగే ఉన్నాడు.

'భాగ్యవంతులారా! అమెరికా దేశవాసులారా! చేతులుమోడ్చి ప్రార్థిస్తున్నాను. కనికరించి ఈ దేశాన్ని కొనండి.'

చాలామంది పోగయ్యారు. అందరూ నక్షత్రకుడివంక అనుమానంగా చూస్తున్నారు.

'అనుమానించకండి. మీరుపెట్టేఖరీదుకి ఒక్కడాలరుకూడా తక్కువ ఫలితాన్ని ఇవ్వదు, రండి కొనండి' ఈ వార్తతెలిసి



దేశదేశాలవాళ్ళు రాకెట్లువేసుకుని వచ్చేశారు.

నక్షత్రకుడికి నేత్రానందంగావుంది పోగైన జనం కళ్ళలో మాత్రం అనుమానం అది గమనించాడు.

'ఏటి శంక మీరు పెట్టుకో నక్కరలేదు, ఆదినుంచీ ముక్కుమూసుకొని తపసు చేసుకోవటానికి అలవాటు పడినజనం. సాత్వికంగా నడుచుకుంటారు స్వామి విధేయులై ఉంటారు. ఏంచేసినా ఏమీ అనరు. అనుకోరు. తరతరాల సంప్రదాయం తరచి చూస్తే ఈ దేశంలోని ప్రజల మంచితనం అతిమంచితనం అవగత మవుతుంది,' జనానికి ఆసక్తి కలిగింది. పరిపాలన తేలికే అనుకున్నారు. కాయితాలు చూపించమన్నారు, నక్షత్రకుడు బిక్కచచ్చిపోయాడు. అయినా గంభీరంగా కాయితా లందించాడు.

రుజాధ్రువం చూపిన మొగ్గు హిమాలయాల్లా కనబడి దేశదేశాలజనుల శరీరాలు చల్లబడ్డాయి. వెనక్కిగగ్గారు. వెళ్ళిపోయారు.

నక్షత్రకు డొక్కడే మిగిలిపోయాడు. అతని కోలమొహం ముడుచుకు పోయింది. చప్పిదవడలు మరీగుంజుకు పోయాయి.

దేశాన్ని అక్కడే వదిలేసి అందినవాడ్ని దొరకబుచ్చుకుని వెళ్ళిపోయాడు.

అతనుమాత్రం బతగ్గలడు.

నన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేసింది. ఓ సాయంత్రం ఆఫీసులోంచి బైటపడి, రోడ్డుమీద యిద్దరం నడుస్తుండగా. "రావుడూ! లీలామహల్లో మంచి ఇంగ్లీషు సినిమా ఆడుతోంది, వెళదాంరా!" అన్నాను.

"ఈ పూట రాలేన్రా! కొంచెం డల్‌గావుంది ఒంట్లో!" అన్నాడు శీతారామయ్య.

"ఓరి వెర్రిమొహమా! ఆదివారంతో ఆఖరు!" అన్నాను.

"క్షమించరా! రాలేను!" అన్నాడు శీతారామయ్య.

"అయితే నీ ఖర్మ! నే వెళ్తాను! ఆ పిక్చరు కోసం చాలా రోజుల్నుంచీ ఎదురు చూస్తున్నాను" అన్నాను వాడేం జవాబివ్వలేదు.

త్రోవలో ఓ హోటల్లో కాఫీ తాగి, ఇద్దరం విడిపోయేం.

అన్నట్టు నే మర్నాడు సినిమాకి వెళ్ళేను. ఇంటర్వల్లో నా ముందు వరసలో కూర్చునున్న శీతారామయ్యనీ, మంగరాజునీ చూసి ఆశ్చర్య పడకుండా వుండలేకపోయేను.

శీతారామయ్య చాలా మారేడు. ఎందుకోసం మారిపోతున్నాడో నా ఊహకందలేదు. కాలమే నిరూపిస్తుందని సరిపెట్టుకున్నాను.

ఒకప్పుడు నేనూ, శీతారామయ్య. మంగరాజుకి కనిపించని శత్రువులం! మంగరాజులోని లంచ గొండి తనాన్ని, స్వార్థాన్ని, 'భజనా'సంఘాన్ని, తీవ్రంగా ద్వేషించేం: కాని ఈవేళ శీతారామయ్య. మంగరాజూ స్నేహితులైపోయేరు. నేను వేరుపడి పోయేను? ఇప్పుడు నేను వాళ్ళిద్దరికీ శత్రువునయ్యా నేమో కూడా! అందుకే శీతారామయ్య నానుంచీ దూరమైపోతున్నాడు అనిపించింది.

భారంగా నిట్టూర్చేను. సినిమా పూర్తవటానికి పావుగంట ముందే బైటికొచ్చేసేను. ఒళ్ళంతా నిస్సత్తువతో తూలిపోతున్నట్టుంది. రిక్షాలో ఇంటికి చేరేను. భోంచేసి గదిలో కిటికీ వారగా వాలబడి. దూరంగా 'హార్బర్స్‌నోస్' మీదనించి గిర గిరా తిరుగుతూ కనిపిస్తున్న లైట్‌హౌస్ కాంతిని చూస్తూ వుండిపోయేను. మనస్సంతా శీతారామయ్యప్రవర్తన నిండివుంది. అలా ఎంతసేపున్నానో నాకే తెలీదు.

"ఏమిటంతలా ఆలోచిస్తున్నారు?" అన్నది వెనకనించి మా ఆవిడ.

"ఏం లేదు!" అన్నాను తలతిప్పకుండానే!

"ఏం లేందే అంతసేపు మీరాలోచించి బుర్ర పాడు చేసుకోరని నాకు తెలీదేమిటి!" అన్నదావిడ మళ్ళీ.

అప్పుడిక దాచాలనిపించలేదు.

శీతారామయ్యలో ఈ మధ్య వస్తున్న మార్పు లనుగురించి ఉన్నదున్నట్టుగా చెప్పేను. ఆవిడ దీర్ఘంగా నిశ్వసించింది.

"ఈ సంగతి నేనూ విన్నాను!" అన్నది.

"నీ కెవరు చెప్పేరోయ్?" అనడిగేను.

"ఎవరో ఎందుకు చెపుతారు? ఆయన భార్యే చెప్పింది. ఆమధ్య ఒట్టికోటకి వెళ్ళేను చూశారండీ! అక్కడ కలిసింది. చీరలుకొనటం అయ్యేక కానేపు అలా వెళ్ళి బీచిలో కూర్చున్నాం. ఆ సందర్భంలో చెప్పింది. పరమ నాస్తికుడనుకున్న తన భర్త ఈ మధ్య భక్తి తత్పరుడవుతున్నందుకూ. వాతకాలంమీద నమ్మకం పెంచుకుంటున్నందుకూ తల నిరుసుతనం నలుగురితో, ముఖ్యంగా 'పెద్ద' వాళ్ళతో వినయంగా వుంటున్నందుకు ఆవిడ మురిసిపోతున్నది. అన్న ట్టిది విన్నారా! ఆయన మీ ఆఫీసరుగారి పిల్లలకి పొద్దుటిపూట ట్యూషను కూడా చెపుతున్నారట! పైపైన అప్పుడప్పుడూ బజారుపనికూడా చేసి పెడుతున్నసూచనలు కనిపిస్తున్నాయి!" అన్నది మా ఆవిడ గుక్క తిప్పుకోకుండా!

"నీకేనా కనిపించేది?" అన్నాను.

"అవును! మొన్న...ఓ రోజు పొద్దుట.. మీరు ఏదో పనిమీదున్నారు గదాని నేనే వెళ్ళేనుగా మార్కెట్టుకి! ఆరోజు ఓ పెద్ద బుట్టనిండా కూర గాయలన్నీ కొంటున్నారు! ఇన్ని [illegible] చేసు కుంటారండీ-అనడిగేను. ఆఫీసరు గారింటికి బంధు వులొచ్చేరమ్మా... ఇవి వాళ్ళకి - అని చెప్పేరు! పరోపకారార్థమిదం శరీరం అన్నారు! ఏమంటారు" అన్నది మా ఆవిడ నవ్వుతూ.

నేనూ ఆమె నవ్వులో శ్రుతి కలిపేను. కాని ఆ నవ్వు నవ్వులా లేదు. ఏడుపులా వుంది. ఏడవలేక నవ్వుతున్నట్టుంది.

* * *

ఆరు మాసాల తరువాత ఓ రోజు!

ఆ వేళ ఒంట్లో నలతగా వుండి ఆఫీసుకి శెలవు పెట్టేను! 'లంఘనం పరమౌషధం' అని మా ఆవిడ బార్లీనీళ్లు తప్ప మరేమీ కంటికి కనబడనీయ లేదు. నీరసంగా పడుకున్నాను.

సాయంత్రం అయిదవుతూండగానే శీతారామయ్య సుడిగాలిలా వచ్చేడు.

"ఒరే మోహనా! అప్పుడెప్పుడో ఆస్వాములారు నా జాతకం చూసి ఏం చెప్పేరో నీకు జ్ఞాపకం వుందా? ఆ మాటలు అక్షరాలా నిజమయ్యేయి! ఏలూరు బ్రాంచికి నన్ను మానేజరుగా వేసేర్రా తండ్రీ! నీ కర్మ కాలి నువ్వీవేళే శెలవు పెట్టేవ్! అక్కడ ఆఫీసులో నాకు బ్రహ్మాండమైన సెండాఫ్ యిచ్చేరు. రాత్రికి బైలుదేరిపోవాలి! రేపే చార్జీ తీసుకోవాలక్కడ! నీకు కోపం వచ్చినా సరేగాని. స్వాములారు త్రికాల వేదిరా!" అన్నాడు ఒక్క గుక్కలో శీతారామయ్య!

వాడికంటే మూడు సంవత్సరాల సీనియర్ని... నన్నింకా వెనక్కి నెట్టేసి... ముందుకి సాగి పోతున్న శీతారామయ్యని మనస్సులోనే మెచ్చు కున్నాను.

"అయితే ఈ ప్రమోషను రావడంలో స్వాము లారి జోస్యం ప్రభావమే తప్ప, నీ ప్రయోజకత్వం లేదంటావుట్రా?" అనడిగేను.

"అంతా వాడి లీల! మన చేతుల్లో ఏముందిరా చెల్లాయేడి?" అనడిగేడు శీతారామయ్య!

"పక్కింటికి వెళ్ళినట్టుందిరా! అన్నాను.

"మరినే వెళ్తాన్రా! టైం అట్టే లేదు. [illegible] అక్కడ ఇల్లు అదీ చూసు [illegible] మా ఆవిడని వాళ్ళ పుట్టింట్లో దింపి [illegible]. వస్తాను!" అంటూ లేచేడు శీతారామయ్య

"విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్!" అన్నాను.

"థాంక్యూ!" అంటూ శీతారామయ్య మెరు పులామాయమై పోయేడు. నాకళ్ళల్లో నీళ్ళుతిరిగేయి.

శీతారామయ్య మరోమనిషి. వాడి అభివృద్ధి గురించి స్వాములారు చెప్పేసేరు. అభివృద్ధికోసం సంఘానికి [illegible] మంగరాజును మంచి చేసుకుని వాడి బోధలు విన్నాడు. అభివృద్ధికోసే - ఆత్మగౌరవాన్ని, మానాభిమానాల్ని చంపుకుని ఆఫీసరింట్లో అద్దమైన చాకిరీలూ చేసేడు. చివరికి [illegible] కూడా ప్రమోషన్ సంపాయించేడు. అధికారం, హోదా పొందేడు. కాని ... నైతిక విలువలు విస్మరించేడు. మంచిని, మానవత్వాన్ని ఆత్మగౌరవాన్ని పూర్తిగా కోల్పోయేడు. ఇప్పుడు శీతారామయ్య మరోమనిషి. వాడిమీద జాలేసిందినాకు

"భగవాన్! వీడ్ని నరకంలోంచి తప్పించు! [illegible] పాప [illegible] ఏ మహాపర్వతాలనూ ఢీకొని [illegible] బోతుంటా [illegible]. వీడు చాలా ప్రమా దంలో ఉన్నాడు ..." అంటూ, శీతారామయ్య కొత్తగా నమ్మనదేవుడికి ఓ "యస్. ఓ. యస్." పంపేసి ఊరుకున్నాను. కళ్ళుమూసుకున్నాను. కనురెప్పల మధ్యనుంచి అశ్రువులు వెచ్చవెచ్చగా బుగ్గలను తాకుతున్నాయి

దూరదూరంగా ... అనంతదూరంలో నడిచి పోతున్న శీతారామయ్య నా అంతర్దృష్టికి ఇంకా కని పిస్తూనే ఉన్నాడు. ఒకసారి స్పష్టంగా, మరోసారి అస్పష్టంగా!

త్వరలో కొత్త సీరియల్

"వైతరణి"

"సమత" ద్వారా ప్రగతి పాఠకులను అలరించిన

వాసిరెడ్డి సీతాదేవి గారి

కొత్త నవల